వలంటీర్ల సేవలు అమూల్యం



మాట్లాడుతునున్న సమన్వయకర్త కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 6 వార్డులకు చెందిన వలంటీర్లకు సేవా పురస్కారాలు



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని తదితరులు

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు అమూల్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 48, 49, 50, 51, 53, 54 వార్డుల్లో సేవలందిస్తున్న వలంటీర్లకు సోమవారం మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్న పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి కె.కె.రాజు చేతుల మీదుగా వలంటీర్లకు పురస్కారాలను అందజేసి సత్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా ప్రజలకు అందుతున్నాయంటే ఆ ఘనత వలంటీర్లకే చెందుతుందన్నారు. కోవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. 6 వార్డులకు సంబంధించి వలంటీర్లు సేవా పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజని ఈశ్వరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, ఏపీడీ పద్మావతి, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, జేసీఎస్ కన్వీనర్ నీలి రవి, అమర్‌రెడ్డి, పి.సునీత, పైడి శ్రీను, షేక్ బాబ్జి, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, సీవోలు, ఆర్పీలు, వలంటీర్లు, పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుతో సంతోషం



మహత్ కాలనీ సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు, సేవలను అందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం గుర్తించి ఏటా అందిస్తున్న సేవా పురస్కారాలు ప్రోత్సహించేలా ఉన్నాయి. గతేడాది కంటే పారితోషకం కింద ఇచ్చే నగదు పెంచారు. ప్రతి ఏటా నేను సేవ మిత్ర పురస్కారం అందుకున్నాను. చాలా హ్యాపీగా ఉంది.

– డి.శైలజ, వలంటీర్, 51వ వార్డు

రెండోసారి పురస్కారం



అయ్యప్పనగర్ సచివాలయంలో వలంటీర్‌గా రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాను. లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నాను. సేవా రత్నా పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. గతేడాది సేవా మిత్ర ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా నేరుగా సంక్షేమ పాలన అందడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

– శ్రావణి, వలంటీర్, 49వ వార్డు

వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించండి



నూతన వస్త్రాలు అందజేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో సోమవారం జరిగిన పద్మశాలి కమిటీ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం పద్మశాలి కుటుంబ సభ్యులకు కె.కె.రాజు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, హబీబ్, తిరుపతి, పోల్‌రాజు, సత్యనారాయణ, త్రినాథ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ.. జాగ్రత్తలు అవసరం

- డిప్యూటీ కలెక్టర్, ఉత్తర ఎన్నికల అధికారి అఖిల



అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: ఎలక్షన్ కోడ్ వచ్చిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలపై డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారి డి.అఖిల ఆధ్వర్యంలో సోమవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలిచ్చి బాధ్యతల గురించి వివరించారు. మోడల్ కోడ్, నామినేషన్లు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ జి.శ్రీరాంమూర్తి, జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ ఫైనాన్స్ ఎస్.శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ పద్మజా, సిటీ ప్లానర్ మహాలక్ష్మి దొర, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.రమేష్, ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' వినతులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఏడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్‌కు 02, ఇంజినీరింగ్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూకు 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చిన ప్రజా వినతులను తక్షణ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్జీలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2 టి.ఎస్.ఎన్.రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దనరావు, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, ఈఈ వాటర్ సప్లై సూరిశెట్టి శేఖర్, టీపీవో అపరంజిత తదితరులు పాల్గొన్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: ఆడపిల్లలు చదువుకోవాలని పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు సోమవారం ఊర్వశి జంక్షన్‌లోని సేన కార్యాలయంలో సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షను రూపుమాపడంలో జ్యోతీరావ్ పూలే, సావిత్రిబాయి దంపతుల పోరాటం అజరామమన్నారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీన, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, పట్నాల ఝాన్సీరాణి, తాటిపూడి సీతారామ్, రాణి, మల్లికార్జున్, లంకా రామారావు, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'స్పందన'కు 13 అర్జీలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీరాంమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 13 వినతులు అందాయి. డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల ఆధ్వర్యంలో తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్రీ రాంమూర్తి అర్జీదారుల నుంచి వాటిని స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో మహాన్నదానం



అన్నదానం చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయం 34వ వార్షికోత్సవం, మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహించారు. బాల మురుగన్ సేవా సమితి, నిత్య భక్తుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. 4వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిద్ధమైన వాటర్ ఫౌంటెయిన్



మహారాణి పార్లర్ కూడలిలో ట్రయల్ వేస్తున్న ఫౌంటెయిన్

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ, మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్‌ను ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. సోమవారం ఫౌంటెయిన్‌కు నీటి సరఫరా కనెక్షన్ ఇచ్చి అది సరిగా పనిచేస్తోందా లేదా అని ట్రయల్ వేశారు. ఫౌంటైన్ సరిగ్గా పనిచేస్తోందని, రంగు రంగుల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.

బైక్ దొంగతనంపై ఫిర్యాదు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్కింగ్‌లో పెట్టిన బైక్ చోరీకి గురైందని ఫిర్యాదు అందింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. మాధవధారలో నివసిస్తున్న ఎస్.వెంకట కృష్ణకుమార్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఏపీ31 డీహెచ్ 7873 నంబర్ గల బైకును పార్క్‌చేశాడు. మరుసటి రోజు ఉదయం 11 గంటల ప్రాంతంలో చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం రాత్రి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రూ.15 వేల నగదు చోరీ

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో పెట్టిన నగదు మాయమైన ఘటన జరిగింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మా కాలనీలో నివసిస్తున్న కె.బాలాజీకృష్ణ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తారు. ప్రస్తుతం అతడు వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నారు. ఈ నెల 9న రాత్రి 11 గంటలకు ఇంటి వద్ద అలికిడైందని, తర్వాత చూడగా బ్యాగ్‌లో పెట్టిన రూ.15 వేల నగదు కనిపించకపోవడంతో సోమవారం రాత్రి క్రైం పోలీసులకు బాలాజీకృష్ణ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్లకోమాపై ప్రజా చైతన్య సదస్సులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.మీనాక్షి కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. 40 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు చోట్ల గ్లకోమా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి, డాక్టర్ రమణ, గ్లకోమా కన్సల్టెంట్ డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీ, పీఎంవోవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి, సుజాత, వైద్య సిబ్బంది, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిని వివరించండి



పొదుపు సంఘాల ఆర్పీలతో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: గడిచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నవరత్నాలు-సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని ప్రజలకు చేరువ చేయాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పిలుపునిచ్చారు. సీతంపేటలోని కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పొదుపు సంఘాల ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు జగనన్న చేసిన మేలును సంఘ సభ్యులకు వివరించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వం ఎన్నో మంచి సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. నాడు-నేడుతో నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసిందన్నారు. కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం.. తల్లీబిడ్డలకు వరం



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీలు

మద్రిపాలెం: ప్రతి ఒక్కరూ పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి అన్నారు. 'పోషన్ అభియాన్'(పౌష్టికాహార పక్షత్సవాలు)లో భాగంగా సోమవారం 53వ వార్డు శ్రీరాంనగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు వెయ్యి రోజుల సంరక్షణను వివరిస్తూ వివిధ రకాల పుష్పాలతో ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా చిన్మయిదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యం గురించి ఎప్పటికప్పుడు అంగన్‌వాడీలు వివరించాలని సూచించారు. ప్రతి తల్లి తన బిడ్డలకు పోషక విలువలతో కూడిన ఆహారం పెట్టేలా అవగాహన కల్పించాన్నారు. పౌష్టికాహారం పిల్లల మేధోశక్తి, చురుకుదనం మీద ఎంత ప్రభావం చూపిస్తుందో వివరించాలని తెలిపారు. ముందుగా అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సీడీపీవో రమణకుమారి పర్యవేక్షించిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, వెనిషా, సుందరి, కుమారి పాల్గొన్నారు.

గీత సహ కులాలకు మూడు సీట్లు ఇవ్వాలి



సంఘీభావం తెలుపుతున్న శెట్టిబలిజ నాయకులు

సీతమ్మధార: వచ్చే ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాలో గీత సహ కులాల (శెట్టిబలిజ, యాత, శ్రీశైన, గౌడ, ఈడిగ)కు మూడు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని నాయకులు నినదించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తరాంధ్ర శెట్టి బలిజ భవనంలో గీత కులాల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో పది లక్షలు మంది ఓటర్లున్నారని, ఏ రాజకీయ పార్టీ 50 ఏళ్లుగా తమకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఏ పార్టీ అయితే గీత కులాలకు ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే తామంతా మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ,ఎస్టీ,మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, దొమ్మేటి నారాయణమూర్తి, జమ్ముల అప్పారావు, సిమ్మా అప్పారావు, చెల్లిబోయిన గోవింద్, కొల్లూరి శ్రీనివాసరావు, గుత్తుల తులసీ పార్వతి పాల్గొన్నారు.

అభియోగాలు నిరూపించండి



మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

సీతమ్మధార: నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులపై ఎరుసు నరసింగరావు చేసిన ఆరోపణలు వాస్తవం కాదని, ఆధారాలుంటే నిరూపించాలని గ్రామ అధ్యక్షుడు డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి సవాల్ విసిరారు. 24వ వార్డు నక్కవానిపాలెం రామాలయం వీధిలోని గ్రామ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో కేసు నడుస్తున్న ఏడు గుడుల స్థలంలో అక్రమంగా నిర్మించిన రహదారి విషయంపై ప్రశ్నించినందుకు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. బిల్డర్‌తో కలిసి నరసింగరావు చేస్తున్న అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చామని, అక్కసుతోనే రూ.10 లక్షలు లంచం అడిగామని ఆరోపిస్తున్నాడన్నారు. ఆయన వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే నిరూపించాలని, గ్రామ ప్రజలతో ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నామని ప్రసాద్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పి.రమేష్, బి.శ్రీనివాసరావు, సెక్రటరీ దిలీప్‌కుమార్‌రెడ్డి, జి.చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ప్రారంభం

మద్రిపాలెం: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మసీదుల్లో సోమవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము(సహెర్) నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు చేపడతారని పలువురు మతపెద్దలు చెప్పారు.

జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెంలోని మజీద్-ఏ-అల్ ఫతా, జాకీర్ హుస్సేన్ నగర్‌లోని మజీద్-ఏ-అల్ ఖదీర్‌లో సోమవారం రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు రంజాన్ ప్రత్యేక తరావీ నమాజ్ చేశారు. ఆయా మసీదుల్లో రంజాన్ నెల రోజుల పాటు ఇఫ్తార్ ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటా..



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు



కార్యక్రమంలో పాల్గొన్న ఆటో కార్మికులు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఆటో కార్మికులతో ఆత్మీయ సమావేశం

సీతంపేట: ప్రజాసంకల్ప యాత్రలో ఆటో కార్మికుల సమస్యలను చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టి ప్రతి ఆటో కార్మికుడికి ఏటా రూ.10 వేలు నగదు సాయం అందజేసి చేదోడుగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెలే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో సోమవారం నిర్వహించిన ఉత్తర నియోజకవర్గ ఆటో కార్మికుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చి పేదలకు అందకుండా చేశాయన్నారు. సీఎం జగన్ పాలనలో నాడు నేడు ద్వారా కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు.

పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో కూడా 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించేలా ప్రభుత్వం చట్టం చేసిందని, పిల్లల చదువు విషయంలో సాయం అందించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు కె.కె.రాజు తెలిపారు.

కె.కె.రాజుకు ఆటో కార్మికుల మద్దతు

ఉత్తర నియోజకవర్గంలో ఇనార్బిట్ మాల్, ఏఎంసీ మాల్ వల్ల భవిష్యత్‌లో 25 వేల మందికి ఉపాధి లభిస్తుందని కె.కె.రాజు అన్నారు. ఆటో కార్మిక సంఘం పెద్దలు తన దృష్టికి తీసుకొచ్చిన డిమాండ్లను పరిష్కరిస్తానని, ఆటో కార్మికుల యూనియన్ ఆఫీస్ నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘాల నాయకులు కె.కె.రాజుకు తమ మద్దతు తెలిపారు. అనంతరం ఆటో కార్మికులకు ఆయన నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎస్.శశికళ, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, కర్రి మురళీకృష్ణారెడ్డి, జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, ఎన్.రవికుమార్, దిడ్డి రమేష్, బొడ్డేటి కిరణ్, హబీబ్, ఆటో యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కేఏ పాల్‌ను గెలిపించుకుందాం



సమావేశంలో పాల్గొన్న పీఎస్పీ నాయకులు

తాటిచెట్లపాలెం: విశాఖ ఎంపీగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్‌ను గెలిపించుకుందామని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జె.రవికుమార్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం రెడ్డి ఏసుపాదం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గాజువాక, ఎస్.కోట, భీమిలి, విశాఖ ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ ప్రాంతాల్లోని క్రిస్టియన్ లీడర్లందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విశాఖలో ఉన్న క్రైస్తవులందరూ ఏకమై కేఏ పాల్‌ను గెలిపించుకోవాలని కోరారు. పార్టీ జాతీయ కో ఆర్డినేటర్ బాబోజీరావు మాట్లాడుతూ కేఏ పాల్ లాంటి వ్యక్తి ఏ రాజకీయ పార్టీలోనూ లేరని, అందుకే ఆయనను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసురత్నం, జోనాథన్ జాన్, డేవిడ్, నిహారిక, కిరణ్, రాజులు జాషువా సత్యనారాయణ, తిమోతి, రమేష్, భరత్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.